క్లుప్తంగా

మసీదు కమిటీ అధ్యక్షుడిగా రహంతుల్లా



విజయపురిసౌత్: స్థానిక జమాయితుల్ ఫిర్దోస్ మసీదు కమిటీ ఎన్నిక శనివారం విజయపురిసౌత్‌లో నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ రహంతుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా ఎస్‌కే అన్వర్, కార్యదర్శిగా ఎస్‌కే జాని, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే సలామ్, కోశాధికారులుగా ఎస్.జానీ బాషా, పి.వినయతుల్లా, ప్రధాన సలహాదారుడిగా ఎస్‌కే మస్తాన్‌వలిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పర్యటన

దాచేపల్లి: మండలంలోని పెదగార్లపాడులో స్థానిక శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, పార్టీ నేత కర్పూరపు వెంకటకోటయ్యలు శనివారం తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా కర్పూరపు వెంకట్రావమ్మ పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని, మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి ఎస్టీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్స్‌ను శనివారం అందజేశారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు రూ.8వేలు విలువ చేసే పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని విద్యార్థులకు ఉచితంగా అందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సర్వేయర్ శ్రీనివాసరావు సూచించారు. హెచ్‌ఎం నాగెండ్ల ఏసయ్య, ఉపాధ్యాయురాలు కేఎల్ కృష్ణప్రియ, డాక్టర్ నెల్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పిడుగురాళ్ల: పదహారు మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు శనివారం తెలిపారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని ఒక షాపులో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అందులో మొత్తం 16 మంది పేకరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. పేకాట రాయుళ్ల వద్ద నుంచి రూ. 2.25 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ జూదం ఆటలు ఎంతటివారైన ఆడినా, ఆడించినా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా 'రాగిడి'

పిడుగురాళ్ల: ఎస్టీయూ పిడుగురాళ్ల మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిందని పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి తెలిపారు. నూతన పిడుగురాళ్ల మండల శాఖ అధ్యక్షుడిగా రాగిడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కుంభా శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా కపిలవాయి నరసింహారావు, మహిళా ప్రధాన కార్యదర్శిగా షేక్ గౌస్‌బీలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారిగా షేక్ కరిమూల్లా, ఎన్నికల పరిశీలకులుగా జల్లి విజయ ప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్ర జిత్ యాదవ్, ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన

మాచవరం: పత్తి సాగు చేస్తున్న రైతులు సాగు విధానంలో దగ్గర అంతరం (90సెం.మీ. 30 సెం.మీ) పద్ధతి పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన్ కేంద్రం (ప్రకాశం జిల్లా) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో జాతీయ పత్తి పరిశోధనా సంస్థ (నాగపూర్) ఆధ్వర్యంలో పత్తి సాగుపై క్షేత్ర పరిశీలన శనివారం నిర్వహించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు పత్తి సాగుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దగ్గర అంతర పత్తి సాగుపై రైతులకు అవగాహనా కల్పించారు. పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు చమత్కార్ మందు పిచికారీ చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ యనిషీబా, డాక్టర్ జాహ్నవి, టీవీ రెడ్డి, కె.భవ్యశ్రీ, నూజివీడు సీడ్స్ ఏజీఎం నరసింహారెడ్డి, ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ రామమ్మ, చంద్రిక, రవికిరణ్, బర్మా నాయక్, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్యానికి రక్ష



కారెంపూడిలో మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పశర్లపాడులో వృద్ధుడికి ఓపీ కార్డు అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

గ్రామగ్రామాన కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు



ఆత్మకూరులో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్యులు



రాయవరంలో మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పెద మల్లుస్వామి

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్రంలో పేదలందరికీ ఒక వరమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం ఆమె మండలంలోని పశర్లపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి వెంటనే వైద్య సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న విప్లవాత్మకమైన పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలులో లేవన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య, ఆరోగ్య రంగంలో ఒక విప్లవం అన్నారు. సర్పంచ్ వట్టికుంట లక్ష్మమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మరెడ్డి, జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ మోర్తల ఉమ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, మాజీ సర్పంచి వెన్నా లింగారెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు చల్లా మట్టారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, ఆర్ఐ దాసరి కాంతారావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారెంపూడిలో...

కారెంపూడి: ప్రజలందరికీ ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేక నిపుణులైన డాక్టర్లచే వైద్య సేవలందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ పేర్కొన్నారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరాన్ని అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. అనంతరం వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. వైద్య సిబ్బంది ముందుగా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందించారు. వారికున్న అనారోగ్య సమస్యల ప్రకారం ఆయా విభాగాలలో ప్రత్యేక నిపుణులైన డాక్టర్ల వద్దకు పంపారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎ.సుబ్బారెడ్డి, డాక్టర్ కె.శ్రీవిద్య, డాక్టర్ ఎం.కిరణ్మయి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ ఆర్.ఆంజనేయులు నాయక్‌లు వైద్య సేవలందించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.ప్రసాద్, సిబ్బంది కంటి సమస్యలున్న వారిని పరీక్షించారు. కళ్ల జోళ్లు, అలాగే శుక్లాలు ఇతర కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించారు. ఆయుర్వేద డాక్టర్ ఉదయలక్ష్మి ప్రత్యేక కౌంటర్ ద్వారా వైద్య సేవలందించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 510 మందికి వైద్య శిబిరంలో సేవలందించారు. గ్రామానికి మంజూరైన 72 ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి సుబ్రమణ్యం, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి.శ్రీనివాస యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని లక్షల మందికి వారి సొంత గ్రామాలలోనే ఇంటి వద్ద వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.పాపిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 305 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా ఏడుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం రిఫర్ చేయటం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పులుసు నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, కేసిరెడ్డి నాగిరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

దుర్గి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండల పరిధిలో పలు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆత్మకూరు గ్రామంలోని సచివాలయం వద్ద నిర్వహించిన వైద్యశిబిరానికి మహిళలు, వృద్ధులతోపాటు, పలువురు యువతీ యువకులు, చిన్నపిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద, తహసీల్దార్ జి.రమేష్‌కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, సర్పంచ్ నాగేండ్ల చెంచారావులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేత కొత్త వరహాలరెడ్డి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి ఆత్మకూరు జంక్షన్ నుంచి గ్రామంలోని సచివాలయం వద్దకు వృద్ధాశ్రమంలోని వృద్ధులను తరలించి వారికి అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు వైద్యశిబిరాన్ని సందర్శించి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీటీసీ వై.నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ బొబ్బ నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చవ్వ రాయపరెడ్డి, కసిరెడ్డి శాంతి రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బ సీతారాంరెడ్డి, కొత్త వరహాల రెడ్డి, అడపాల అంబారావు, శివయ్య, పుప్పాల సౌరెడ్డి, ఎర్రబ్రోతుల సత్యనారాయణ, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

మోర్జంపాడులో...

మాచవరం: మండలంలోని మోర్జంపాడు–1 గ్రామ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 520 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.ఎస్. చక్రవర్తి, ప్రసాదరావు తెలిపారు. ఎంపీడీఓ వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, గ్రామ కమిటీ చైర్మన్ బ్రహ్మరెడ్డి, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

రాయవరంలో...

మాచర్లరూరల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇంటివద్దకే కార్పొరేట్ వైద్యాన్ని తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతోమంది ఆరోగ్యానికి భరోసాను కల్పిస్తుందని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని రాయవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక యంత్రాలతో సాంకేతిక పరిజ్ఞానంతో కార్పొరేట్ వైద్యాన్ని పేద ప్రజల చెంత వద్దకే తీసుకొచ్చి విలువైన వైద్యాన్ని ఉచితంగా అందించటంతోపాటు మందులు అందించి వారి ఆరోగ్య స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ క్యాంపులో 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, గొర్రెల పెంపకందారుల యూనియన్ జిల్లా చైర్మన్ బూడిద సైదులు, వైఎస్సార్ సీపీ నాయకుడు సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పి.సుందరలీల, ఎంపీటీసీ మట్టా వెంకటేశ్వర్లు, నాగెండ్ల బాబు, పిన పాటి ప్రవీణ్, ఏసుపాదం, ఎంపీడీఓ సరోజినిదేవి, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, వైద్యులు ఆర్‌వీ రేవతి, ప్రదీప్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు విజిలెన్స్ తనిఖీలు



తనిఖీల రిపోర్టులను తయారు చేస్తున్న విజిలెన్స్, విద్యుత్తు శాఖ అధికారులు

కారెంపూడి: మండలంలోని ఏడు గ్రామాలలో శనివారం విద్యుత్తు శాఖ విజిలెన్స్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. అక్రమంగా విద్యుత్తు వినియోగానికి పాల్పడుతున్న 108 మందిని గుర్తించి వారికి రూ.3.99 లక్షల అపరాధ రుసుమును విధించారు. డీపీఈ ఈఈ కె.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఈఈ జె.హరిబాబు పర్యవేక్షణలో 47 మంది అధికారులు, 141 మంది సిబ్బంది 47 బృందాలుగా ఏర్పడి కారెంపూడి, చింతపల్లి, ఒప్పిచర్ల, రెడ్డిపాలెం, చినగార్లపాడు, పేటసన్నెగండ్ల, పెదకొదమగుండ్ల గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 4,450 సర్వీసులను తనిఖీ చేశామని అనుమతి లేకుండా నేరుగా విద్యుత్తు వాడుకుంటున్న, అలాగే వివిధ మార్గాల ద్వారా అక్రమంగా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించామని అధికారులు తెలిపారు. విద్యుత్తు చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించినట్లయితే ఫోన్ 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు ఫోన్ చేసి కాని, వాట్సప్ ద్వారా కాని తెలపాలని డీపీఈ ఈఈ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీటర్‌కు సీలు వివిధ కారణాల వల్ల పోతే వెంటనే అధికారులకు తెలపాలని కోరారు. తనిఖీలలో డీఈఈ ఎం.రవికుమార్, డీఈఈ కె.రవికుమార్, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ కె.కోటేశ్వరరావు, ఏఈ సీహెచ్ కోటేశ్వరరావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అమృత కలశాలు సేకరణ


మాచవరం: ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలల్లో నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా అమృత కలశాలను సేకరించడం జరిగిందని ఎంపీడీఓ యు.వరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సేకరించిన అమృత కలశాలను జిల్లా కేంద్రాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దార లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీలు సీహెచ్ లక్ష్మయ్య, కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ జానీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి అండ



మాచర్లరూరల్: తోటి ఉద్యోగి కుటుంబానికి చేయూతను అందించి, వారికి అండగా ఉండటం అభినందనీయమని రూరల్ సీఐ షేక్ షమీముల్లా అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఇటీవల మృతిచెందిన హోంగార్డు రంగారావు భార్యకు రూ.35వేల నగదును అందిస్తూ ఆయన మాట్లాడారు. హోంగార్డు రంగారావు అనారోగ్యంతో ఆకస్మికంగా మృతిచెందటం బాధాకరమని, వారి కుటుంబానికి మేమున్నామంటూ సోదర భావంతో తోటి ఉద్యోగులంతా కలిసి నగదును అందించటం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది వహీద్, బాలకృష్ణ తదితరులున్నారు.

వివాదరహిత గ్రామంగా తురగావారిపాలెం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి

అమరావతి: ప్రతి సమస్యకు కేసులు పెట్టుకోవటమే పరిష్కార మార్గం కాదని, నేటి సమాజ పరిస్థితుల దృష్ట్యా రాజీపడటమే రాజమార్గంగా గుర్తించాలని సత్తెనపల్లి న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని మునగోడు శివారు తురగావారిపాలేన్ని సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో వివాదరహిత గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భాన్ని గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఇప్పటి వరకు గ్రామస్తులు తమ సమస్యలకు గ్రామ పెద్దలు చూపిన పరిష్కారాలను గౌరవించటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే పద్ధతిని అవలంభించి, మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఎటువంటి వివాదమైన పెద్దల సమక్షంలో చర్చించటం ద్వారానే పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలిసైదా, ప్యానల్ న్యాయవాదులు శ్రీనివాసరావు, వెంకటశివ, సీఐ బ్రహ్మం, గ్రామ సర్పంచ్ బంకా విష్ణు, మునగోడు పీఏసీఎస్ అధ్యక్షుడు సింగం పుల్లారెడ్డితో పాటుగా పారాలీగల్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలి

అమరావతి: మహిళా సాధికారతే లక్ష్యంగా నిరంతరం కృషి చేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు వైఎస్సార్ క్రాంతి పథం అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ 8 రకాల రుణాలను డ్వాక్రా మహిళలకు అందించి, ఆర్థికంగా వారి పురోభివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి చేయూత నందించాలన్నారు. మండలంలో మహిళలకు అందించిన రుణాలు రూ.1.20కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో డ్వాక్రా మహిళలు రుణ నగదు తిరిగి చెల్లించినప్పటికీ ఆ మొత్తాన్ని యానిమేటర్లు తమ సొంతానికి వాడుకున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. మహిళలను మోసగించి, వారి నగదు వాడుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

దిడుగులో 300 గ్రాముల గంజాయి పట్టివేత

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామంలో శనివారం పెదకూరపాడు ఎస్‌ఈబీ ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్ మల్లాది భుజంగరావు తన సిబ్బందితో దాడి నిర్వహించి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఎస్ఐ ఫణికుమార్ మాట్లాడుతూ అమరావతికి చెందిన షేక్ ఇబ్రహీం, బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలేనికి చెందిన కోజ్జా అంకమరావు ద్విచక్ర వాహనంపై 300గ్రాముల గంజాయి తరలిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు దిడుగు గ్రామం వద్ద వారిద్దరిని, గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ లబ్ధి కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్రంలో కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన పేద కుటుంబాలే ప్రామాణికంగా 100 శాతం పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 43వ సచివాలయంలో 178వ రోజు రెంటచింతలలోని ఆనంద్‌పేట కాలనీలో ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా ఎంత ప్రయోజనం చేకూరిందో ప్రతి గడపకు వెళ్లి వివరించారు. ప్రభుత్వ విప్ పీఆర్కేకు వెళ్లిన ప్రతి గడపలో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తమకు కలిగిన లబ్ధిని వివరించారు. దేశ చరిత్రలోనే ఇన్ని సంక్షేమ పథకాలు అతి తక్కువ కాలంలో అమలుచేసిన ఒకేఒక్క నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. సీఎం జగన్ పాలనను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. పేదలకు ఇంకా మేలు చేయాలనే వజ్ర సంకల్పంతో జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఒక్కొక్క కుటుంబానికి ఏఏ పథకం ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరిస్తూ రాష్ట్రం అన్నీ రంగాలలో అభివృద్ధి చెందాలంటే మీ చల్లని ఆశీస్సులు, దీవెనలు సీఎం జగన్‌కు అందించాలని కోరారు. గ్రామంలోని ఒక్కో కుటుంబం రూ.1.50 లక్షల నుంచి రూ.4.50 లక్షల వరకు లబ్ధి పొందినట్లు తెలిపారు. జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని రాష్ట్ర ప్రజలు 100 శాతం నమ్మకంతో ఉన్నారన్నారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన రానున్న 2024 సార్వత్రిక ఎన్నికలలో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను ఎన్నుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఎల్లో మీడియా ప్రభుత్వంపై విషం చిమ్ముతూ రాసే పచ్చ రాతలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఇటీవల సర్వేల ఫలితాలు వెల్లడిస్తున్నాయన్నారు. ముందుగా కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి, పీఆర్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం చిన బ్రహ్మరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో–ఆర్డినేటర్ మోర్తల ఉమ, దుర్గిమార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వర రెడ్డి, సత్రశాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మరెడ్డి, పార్టీ నేతలు మర్రి లూర్ధురాజు, బి.సంపూర్ణమ్మ, ఏరువ విజయ్ రెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, పల్లెర్ల కోటిరెడ్డి, పేర్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు..



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ, నాయకులు

పిడుగురాళ్ల: విద్యతోనే ఉన్నత శిఖరాలు అందుకుంటారని పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ తెలిపారు. పట్టణంలోని మన్నెంపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాలలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థుల స్థితిగతులు మారనున్న నేపథ్యంలోనే విద్యార్థులు బాగా చదువుకుని, మంచి ఉద్యోగాలు పొందాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పల్నాడు డివిజన్ విద్యార్థి విభాగం అధ్యక్ష్యుడు షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యతు కోసం రాష్ట్ర ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, షీల్డ్‌లను అందించారు. పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ ఎండీ రషీద్, గురజాల నియోజకవర్గ ముస్లిం మైనార్టీ యూత్ నాయకుడు ఎండీ అలీం, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు 132 పరుపులు వితరణ

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలకు శనివారం హైదరాబాద్ మలాని ఫోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన డీజీఎం కె.ప్రవీణ్‌కుమార్ 132 పరుపులను వితరణగా అందజేశారు. కళాశాలకు కావాల్సిన మరో 250 పరుపులను త్వరలో అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నూతక్కి సరోజిని మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందజేస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని చదువులలో రాణించి ఉన్నతస్థితికి చేరుకోవటంతో పాటు కళాశాల ప్రతిష్ఠను పెంచే విధంగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు పరుపులను అందించటానికి కృషి చేసిన కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సాగర్ పరివార్ అధ్యక్షుడు ఎం.మల్లిఖార్జునరావు, సంయుక్త కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు సైదారెడ్డి, సభ్యులు విజయకుమార్, కె.శేషు, రమేష్ నాయుడులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ ఫౌండేషన్ ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహిత, ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ చౌదరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధితునికి లయన్స్ క్లబ్ ఆర్థికసాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల లయన్స్ క్లబ్ సభ్యులు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నాదెండ్ల లోకేష్‌కు వైద్యం ఖర్చుల కోసం రూ. 51 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామానికి చెందిన నాదెండ్ల లోకేష్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉన్నాడు. వారి కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు పిడుగురాళ్ల లయన్స్ క్లబ్ సభ్యులు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండా నారాయణ, సెక్రటరీ కోడూరు కాశీ శంకర్, ట్రెజరర్ ఆవుల జనార్ధన్ రావు, సభ్యులు తంగుటూరి సతీష్, కొనకొండ్ల శ్రీను, కొత్త కాశీ విశ్వనాథం, వెంకట స్వామి, యడవల్లి ఏడుకొండలు, కనమర్లపూడి రామకృష్ణ, షేక్ తాహిల్, కాకుమాను జగన్, బెజవాడ మధుసూధనా చారి పాల్గొన్నారు.

అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలి

మాచవరం: వలసలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా కృషి చేయాలని ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పనులకు సంబంధించిన లేబర్ బడ్జెట్ తయారీ, పనులు గుర్తింపుపై మండల స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.